
# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

# లలిత

## ( కినిమా పత్రిక ఆగస్టు 1953 నుంచీ పునర్ముద్రణ)



వినోదావారి "దేవదాసు"లో చంద్రముఖిగా

**రమారమి** పదిహేనేళ్ళ క్రితం త్రివేంద్రం (మలబారు)లో తిరువాన్కూరు మహారాజాగారి పుట్టినరోజు పండగ జరిగింది. ఆనాడు రాజకుటుంబం వారి సమక్షంలో ఒక ఏడేళ్ళ బాలికా, ఆమె చెల్లెలు రాధాకృష్ణ నృత్యం చెయ్యడానికి ఏర్పాటు జరిగింది. అప్పటికే ఈ ఏడేళ్ళ బాలిక తిరువాంకూరు ఆస్థాన నాట్యాచార్యుడైన గోపీనాథ్ వద్ద నృత్య విద్య అభ్యసిస్తున్నది. అదీగాక ఆమె గొప్ప కుటుంబానికి చెందినది. ఆమె పెత్తల్లికి మలయాలో రబ్బరు తోటలున్నాయి. ఆమెకు

వాటిపై నెలకు పదివేలు రాబడి ఉంది.

ఈ బాలిక పక్కన కృష్ణుడుగా నటిస్తున్న అయిదేళ్ళ బాలిక, ముద్దుపేరు "పప్పీ"కి సరిగా నిలబడటం కూడా చేతకాదు. అయినా మురళి చేతబట్టి నెమలి పింఛం ధరించి ఉత్సాహం కొద్దీ కృష్ణుడుగా నృత్యం చేస్తూ ఉండేది.

ఈ రోజు "రాధ"కు పర్వదినం. జనం కళకళలాడుతున్నారు. తాను వాళ్ళ ఎదుట నృత్యం చేస్తుంది. ఉత్సాహమే తప్ప భయమూ, బాధ్యతా ఏమీలేదు. కానీ తీరా నృత్యరంగానికి పోవలసి వచ్చేసరికి "పప్పీ" బావురుమన్నది. పెద్దవాళ్ళు ఎట్లాగో ఆ పిల్లను సముదాయించి నాట్యం చేయించారు.

ఆనాటి "రాధాకృష్ణు"లే నేడు మనమందరమూ ఎరిగిన లలితా, పద్మినీలు. వీరిద్దరూ 1946 నుంచి అనేక తమిళ చిత్రాలలోనూ, కొన్ని తెలుగు చిత్రాలలోనూ జంటగా నృత్యాలు చేసి అశేష జనాన్ని ఆకర్షించారు. 1948 నుంచీ వీరు సినిమాలలో పాత్రలు కూడా ధరిస్తున్నారు. వీరి నాట్యంలాగే నటన కూడా సినిమా ప్రేక్షకుల ఆదరాన్ని చూరగొన్నది. గడచిన నెలలో తెలుగు సినిమా ప్రేక్షకులు లలితను "ప్రపంచం"లో నర్తకిగానూ, "ఒక తల్లి పిల్లలు". దేవదాసు" చిత్రాలలో నటిగానూ చూశారు. నటిగా ఆమె "కినిమా" పాఠకుల ఆదరాన్ని చూరగొన్నట్టు ఈ సంచికలోని జనవాక్యం రుజువు చేస్తోంది. గడచిన కొద్ది సంవత్సరాలలో లలిత "తిరుగుబాటు", "బీదలపాట్లు", "సింగారి", "అమ్మలక్కలు", "పెళ్ళికూతురు", "కాంచన" చిత్రాలలో తెలుగు సినిమా ప్రేక్షకులకు కనబడింది.

లలిత 1931 జనవరి 28న త్రివేంద్రంలో పుట్టి 1943 దాకా అక్కడే పెరిగింది. లలిత తరువాతది పద్మిని, ఆమె తరువాత పుట్టినవాడు చంద్రకుమార్ (స్కూలు ఫైనలు చదువుతున్నాడు) అందరికన్నా ఆఖరుది రాగిణి. లలితగాని, పద్మినిగాని బడికిపోయి చదువుకోలేదు. పంతులు ఇంటికి వచ్చి చదువు చెప్పేవాడు. లలిత మొదటినుంచీ చలాకీ పిల్ల. నృత్యం మీద ఆసక్తి జాస్తి. అందుచేత తల్లి సరస్వతీ అమ్మాళ్‌గారు తన కూతుళ్ళిద్దరికీ నృత్యం నేర్పించింది. గోపీనాథ్ గారు ఈ అక్కచెల్లెళ్ళకు కథకళీ నృత్యం నేర్పారు. లలితకు అన్ని రకాల నృత్యం కన్నా ఈ కథకళీ మీద ప్రీతి హెచ్చు. కథకళీలోనే ఆరు ఏడూ రకాలున్నాయనీ, అన్నీ భయానకంగా ఉండవనీ, అందులో శృంగార ప్రధానమైన రకం చాలా లలితంగా ఉంటుందనీ ఆమె చెబుతుంది.

లలితా పద్మినీలకు భరతనాట్యంలో శిక్షణ ఇచ్చినవారు తంజావూరు నివాసి టి.కె మహాలింగం పెళ్ళైగారు. ఉదయశంకర్ గారి వద్దకూడా వీరు శిక్షణ పొందారు. ఉదయ శంకర్ తయారు చేసిన "కల్పన" చిత్రంలో కూడా నటించారు.

1943 – 44లో లలిత కుటుంబం త్రివేంద్రం నుంచి మద్రాసుకు వచ్చి చేరుకున్నది. ఈ రోజులలో మద్రాసులో నృత్యానికి ఆదరం బాగా హెచ్చుతున్నది.

ప్రతి ఇంటా ఆడపిల్లలు సంగీతంలాగే నృత్యం కూడా పరిపాటిగా నేర్చుకుంటున్నారు. అందుచేత లలితా పద్మినీలకు త్వరలోనే గొప్ప కీర్తివచ్చింది. ఎక్కడ బడితే అక్కడ వీరి నృత్య ప్రదర్శనలు జరిగాయి. వీరు మన ప్రాంతాలలోనేకాక సింహళంలో కూడా ప్రదర్శనలిచ్చి చాలా పేరు సంపాదించుకున్నారు. ఎన్నో షీల్డులూ, పతకాలూ, కప్పులూ బహుమతి పొందారు. ప్రభుత్వ వర్గాలుకూడా వీరి నృత్యప్రదర్శనలను యుద్ధనిది వసూళ్ళు వగైరాలకు ఉపయోగించుకున్నారు.

అనుక్షణమూ తమ చిత్రాలలో కొత్త ఆకర్షణలనూ, కొత్త వినోదాలనూ ప్రవేశపెట్టే మార్గాలను అన్వేషిస్తూ ఉండే చిత్ర నిర్మాతలు లలితా పద్మినీల విలువను సులువుగా కనిపెట్టారు. వీరికి సినిమాలలో బుకింగులు దొరకసాగాయి. వీరు మొట్టమొదటిసారిగా సినిమాలలో నృత్యం చేసినది కోయంబత్తూరు పక్షిరాజావారి "కన్నిక" తమిళచిత్రంలో. ఆనాటినుండీ దాదాపు ప్రతి తమిళచిత్రంలోనూ నృత్యం చేస్తూ వచ్చారు.

లలితకు (పద్మినితోబాటు) మొట్టమొదటిగా నటించే పాత్ర ఇచ్చినది తెలుగు చిత్ర నిర్మాత అయిన పి.పుల్లయ్య గారు, రాగిణీవారి "తిరుగుబాటు"లో. ఇందులో లలిత ధరించిన పాత్ర చాలా చిన్నదే అయినా సినిమా నటిగా ఆమె జీవితానికిది నాంది అయింది. దీని అనంతరం "ప్రసన్న" అనే మళయాళీ చిత్రంలో లలితకు నాయిక పాత్ర లభించింది. "బీదలపాట్లు" చిత్రంలో ఈమె నటించిన పాత్ర చాలా చలాకీ అయినదీ, విషాదాంతమైనదీనూ. ఈ పాత్రను లలిత చాలా విజయవంతంగా నిర్వహించింది. "సింగారి" చిత్రంలో తాను ప్రధానపాత్ర నిర్వహించినప్పటికీ ఆ పాత్రకన్నా "కాంచన" చిత్రంలో తాను ధరించిన పాత్ర చాలా కష్టమైనదని లలిత అభిప్రాయం. "అమ్మలక్కలు"లో ఈమె దుర్మార్గపు పాత్రను ధరించి బాగా ఒప్పించింది. "ఒక తల్లి పిల్లలు"లో కూడా ఈమె పాత్రను ప్రేక్షకులు చాలా మెచ్చుకున్నారు.

వినోదావారి "దేవదాసు"లో లలిత ధరించిన చంద్రముఖి పాత్ర చాలా కష్టమైనది. చంద్రముఖి పురుషులను ఆకర్షించడం వృత్తిగా గలది అయి ఉండి కూడా తన ఆకర్షణకు ఏ మాత్రమూ లొంగని దేవదాసుచేత బలంగా ఆకర్షించబడుతుంది. అతనిచేత పడవలసిన మాటలన్నీ పడి చివరకు తన వృత్తినికూడా విసర్జించి దేవదాసు కోసం నిరీక్షిస్తూ, జన్మకు శివరాత్రిగా ఒక్కమారు అతన్ని కలుసుకుని అతనికి తన హృదయం విప్పిచెప్పగలుగుతుంది. ఈ నిరాడంబరమైన, లోతయిన, విషాదకరమైన పాత్రకు వినోదావారు చాలాకాలం ఎవరినీ నిర్ణయించక ఆఖరుకు లలితను ఎన్నుకున్నారు. కొంతవరకు ఆమె నృత్యాన్ని వినియోగించుకునేటందుకే వారామెను ఎన్నుకుని ఉండవచ్చు. కాని "దేవదాసు" చిత్రం చూసినవారు ఈమె నృత్యాలను మరిచిపోయిన తరవాత ఎంతోకాలం ఈమె నటనను ప్రత్యేకించి దేవదాసుకు చంద్రముఖి తన హృదయం విప్పిచెప్పే ఘట్టంలో లలిత చూపిన భావాలను మరువలేకపోతారు.

"దేవదాసు" షూటింగు నడిచే రోజులలో ఒక సంఘటన జరిగింది. దేవదాసు పాత్ర ధరిస్తున్న నాగేశ్వరరావు ఒంటరిగా కూర్చుని ఉండగా లలిత వచ్చి అతని సమీపంలో కూర్చున్నది. ఇద్దరూ, ఏదో బాతాఖానీ ప్రారంభించారు. నాగేశ్వరరావు అకస్మాత్తుగా లలితతో "నువ్వు ధరించే పాత్రను గురించి నీ అభిప్రాయమేమిటి?" అని అడిగాడు.

లలిత కొంచెం ఆలోచించి. "ఆమె చాలామంచిది" అన్నది.

నాగేశ్వరరావు అంతటితో వదలక, "ఆ పాత్ర నటించేటప్పుడు ఆమె మనస్తత్వాన్ని ఏ విధంగా భావిస్తావు?" అని అడిగాడు.

వెంటనే లలిత ఆ ప్రశ్నను దులిపేసుకుని, "నేనేమీ ఆలోచించను. మాస్టర్ (అంటే డైరెక్టరు వేదాంతం రాఘవయ్య) ఏం చెయ్యమంటే అది చేస్తాను. నాకల్లా నృత్యం చెయ్యటమే ఇష్టం" అనేసింది.

అప్పుడే తొమ్మిది, పది చిత్రాలలో పాత్రలు ధరించి, ఆ పాత్రలను విజయవంతంగా నిర్వహించి, నృత్యం చెయ్యడానికి కన్నా పాత్రధారణలే ఎక్కువగా డిమాండులో ఉన్న లలిత ఈ మాట అన్నదంటే ఎవరికన్నా తప్పక ఆశ్చర్యం కలిగిస్తుంది. తనకు నటించటమే చాలా ఇష్టమనీ, ప్రతి పాత్రనూ చంద్రముఖి పాత్రలాగా లోతుగా అర్థం చేసుకుని ఆ పాత్రలో లీనమై సెట్టుమీదికి వస్తాననీ లలిత అన్నట్టయితే విశ్వసించలేనివారుండరు. కానీ అది వాస్తవం కాదు. లలిత అబద్ధాలూ, కపోటపు మాటలూ చెప్పలేదు.

"అవును. మా నృత్యాలకు వెనక ఉన్న గిరాకీ సినిమాలలో ఇప్పుడు లేదు. అయినా నాకు నృత్యం చెయ్యడంలో ఉన్న ఆనందం నటించటంలో లేదు. డబ్బుకోసం పాత్రధారణ చేస్తున్నానేగాని నృత్యం చెయ్యటమే నాకానందం. నటించేటపుడు పాత్రను గురించి చాలా దీర్ఘంగా ఆలోచించాలి. పాత్రను అర్థం చేసుకోవాలి. పాత్రలో లీనమై నటించాలి. దీనికి నేను అర్హురాలిని కాను. అంత  ఓపికా స్థిరత్వమూ నాకు లేవు" అంటుంది లలిత. లలితలో వైరుధ్యంలాగా ఉన్నట్టు కనిపించేది నిజంగా వైరుధ్యం కాదని పైమాటలే రుజువు చేస్తాయి. పాత్రను నటించటంలోగల బాధ్యత ఆమెకు తెలిసినట్టుగా కొందరు ప్రసిద్ధ నటులకు కూడా తెలియకపోవచ్చును. పాత్రధారణ పట్ల ఆమెకు గల భావం విముఖత్వంకాదు. భయం. ఉన్నట్టుండి ఒకనాడు లలిత ఈ భయాన్ని జయిస్తుంది. గొప్పనటి అవుతుంది. సందేహం లేదు. నటనపట్ల ఆమెకు విముఖత్వమే ఉంటే ఆమె తన పాత్రలను, డైరెక్టరు ప్రోద్బలం వల్లకూడా, ఇంతబాగా నటించి ఉండదు.

సినిమా నటనపట్ల ఆమెకు గల గౌరవం ఇంకొక విధంగా కూడా ఆమె బయట పెట్టుకుంటుంది. ఆమె అభిమాన నటులు తెరమీద ఆకర్షవంతమగా మెదిలి  సులభంగా పేరు తెచ్చుకునేవారు కానేకారు. లోతైన భావాలను వ్యక్తం చేయగలవారు. తనకిష్టమైన నటుల పేర్లు అడిగితే ఆమె నాగేశ్వరరావునూ, నాగయ్యనూ తడువుకోకుండా పేర్కొన్నది.

సినిమా చిత్రాల విషయంలో కూడా ఆమె అభిరుచులు ఉన్నతంగానూ, విస్పష్టంగానూ ఉంటాయి. తెలుగు చిత్రాల మీద ఆమెకు అపారమైన గౌరవం ఉంది. "తెలుగు చిత్రాలు దక్షిణదేశంలోనే కాదు భారతత దేశంలోకల్లా ఉత్తమమైనవని నా దృఢ విశ్వాసం" అంటుంది లలిత.

లలిత ఇంగ్లీషు, తమిళ భాషలు ధారాళంగా మాట్లాడుతుంది. మళయాళం ఆమె మాతృభాష తెలుగు సరిగా మాట్లాడలేదుగాని మాట్లాడుతుంటే అర్థం చేసు కుంటుంది. తనకు సంగీతం వినటం సరదా అనీ, పాడటం చాతకాదనీ, పాటపాడే గొంతు లేదనీ అంటుంది. కానీ ఆమెకు పాట వచ్చును. ఆ మాత్రం పాట వచ్చినవాళ్ళు సాధారణంగా తాము పాడటానికి అర్హులుకారని చెప్పుకోరు. మిగిలిన విషయాలలోలాగే పాట విషయంలో కూడా ఈమె తక్కువ ప్రమాణాలను పరిగణించదు. ఆమెలో కృత్రిమత్వం ఏమీ లేదు. తనలో తానేమీ ఆకర్షణ చూసుకోదు. తానొక సినిమా తార అని జ్ఞాపకం చేసేవారిని ఆమె భరించలేదు. సినిమా నటిగా ఆమె కోయంబత్తూరు. సేలం, త్రివేండ్రంపోతూ ఉంటుంది. ఒక్క త్రివేండ్రంలో తప్ప మిగతా చోట్ల ఆమె చుట్టూ జనం మూగుతారు, సినిమా సంభాషణలు వల్లిస్తారు, సినిమా పాటలు పాడతారు. ఇది ఆమెకు రుచించదు. త్రివేండ్రంలో ఆమెనెవరూ నర్తకిగా, సినిమా తారగా చూడరు. మనిషిగా చూసి మాములు కుశలప్రశ్నలూ, ప్రసంగాలూ చేస్తారు. అందుచేత ఆమెకు త్రివేండ్రం వెళ్ళినప్పుడల్లా తిరిగి మద్రాసు రావడం కష్టమనిపిస్తుంది.

ప్రస్తుతం లలిత నటిస్తున్న చిత్రాలలో తెలుగు చిత్రాలేమీ లేవు. కాని తెలుగు ప్రేక్షకులు లలిత నటనను ముందు ముందు తప్పక చూస్తారు. గొప్పనటి కావడం ఆమెకు తప్పనిసరి. లలితా పద్మినీలు నర్తకులుగా ఇకముందు సినిమాలలో బుక్ అయే అవకాశాలు తక్కువ. లలితలాగే పద్మినికూడా పాత్రలు ధరిస్తున్నది. డబ్బు కొరకే అయినప్పటికీ లలిత పాత్రలు ధరించి తీరాలి. జనవరి 28 లగాయతు ఫిబ్రవరి 26 మధ్య పుట్టినవారు పరిస్థితుల ప్రోద్బలం ఉంటేనేగాని తమ సమగ్రశక్తులను దీపింపజేయరని షీరో ప్రవచనం. పరిస్థితుల ప్రోద్బలంతో లలిత గొప్ప నటి అయితీరుతుంది. చిత్ర నిర్మాతలు సామాన్యులు కారు.

లలితా పద్మినీల నృత్యాలు చిత్రాలకు ఆకర్షణ అవుతాయని ఒకప్పుడు నిర్మాతలు పసికట్టినట్టే లలిత ఉత్తమ తార అవుతుందని కూడా పసికట్టి ఆమెచేత అద్భుతమైన పాత్రలు నటింపజేస్తారు. జగత్ప్రసిద్ధిగన్న ఆనటోల్ ఫ్రాన్స్‌కు రాయడమంటే ఏ మాత్రమూ ఇష్టం ఉండేది కాదనీ, ఒకానొక స్త్రీ ప్రోద్బలం మీద కలం పట్టే వాడనీ, కలం పట్టినప్పుడల్లా అద్భుత రచన చేసేవాడనీ చెబుతారు. లలితకూడా ఆ విధంగానే గొప్పనటి అయితీరుతుంది.

Post your comments